శభాష్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య



జీడిమెట్ల: డ్రగ్స్ కేసులో పట్టుబడిన నిందితులు జైలు నుంచి బయటకు రాకుండా త్వరగా ఇన్వెస్టిగేషన్ చేసినందుకు జీడిమెట్ల డీఐ కనకయ్యను తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ సాండిల్య రివార్డుతో సత్కరించారు. డిసెంబర్ 2024లో జీడిమెట్ల డీఐ కనకయ్య డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో లోతుగా పరిశీలించిన డీఐ.. నిందితులు బయటకు వస్తే ఎంత ప్రమాదకరమో కోర్టుకు తెలియజేస్తూ వారిపై లోతైన విచారణ జరిపి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. నిందితులు బెయిల్‌కోసం అప్పీల్ చేసుకోగా.. బెయిల్ రాకుండా జైలులోనే ఉండేలా డీఐ విచారణ షీటును కోర్టుకు అందించారు. ఈకేసులో డీఐ కనకయ్య చేసిన కృషికి తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూర్ డైరెక్టర్ సందీప్ సాండిల్య శుక్రవారం ఆయన కార్యాలయంలో సత్కరించి అభినందించారు. అనంతరం బాలానగర్ పోలీస్ టీంతో పాటు జీడిమెట్ల పీఎస్ వారు ఆయనను అభినందించారు.

అధికారులు సమస్యలపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: ఆయా డివిజన్‌లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం కాలనీలో నెలకొన్న సమస్యలు, వివిధ ఆలయాల బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని, నూతన సంక్షేమ సంఘం ప్రతినిధులు.. ఇలా అనేకమంది కాలనీ వాసులు జీడిమెట్ల దండమూడి కాలనీలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలపై అధికారులతో ఆరా తీశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో శుక్రవారం నాయకులు, ప్రజలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

తుమారు చెరువు అలుగుపై .. బ్రిడ్జి నిర్మించండి



వర్షం పడితే పరిస్థితి ఇది..

- నాలుగు గ్రామాలను కలిపే రోడ్డు
- చెరువు తూము నుంచి నిత్యం నీరు
- రాకపోకలకు ఇబ్బంది

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో 28 ఎకరాల విస్తీర్ణంలో తుమారు చెరువు ఉంది. వర్షాకాలంలో భారీ వర్షాలు పడినప్పుడు మాత్రమే అలుగు పారేది. ప్రస్తుతం నగరం విస్తరించడంతో చెరువు చుట్టూ 3 కిలో మీటర్ల మేర భవనాలు, విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు, పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, హోటల్లు రావడంతో వచ్చే డ్రైనేజీ నీరు చెరువులో కలుస్తుంది. దీంతో 24 గంటల పాటు అలుగు నుంచి మురుగునీరు ప్రవహిస్తూనే ఉంది. ఈ కట్ట మీదుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ తూముపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని తెరమీదకి వచ్చిన ఆచరణలో సాధ్యం కాలేదు.

నిత్యం రాకపోకలతో రద్దీ

జీడిమెట్ల పారిశ్రామిక వాడ, దూలపల్లి, కాచిగూడ, గుండ్ల పోచంపల్లి ప్రాంతవాసులు ఈ చెరువు కట్ట మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలుగు నుంచి నిత్యం నీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు సులువుగా ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మిస్తే 3, 4 కిలోమీటర్ల దూరం కూడా తగ్గుతుంది.



తుమారు చెరువు అలుగుపై నిత్యం పారుతున్న మురుగునీరు

చిన్నపాటి వర్షం వస్తే..

చెరువు ఎగువ భాగమైన బహదూర్ పల్లి, మైసమ్మగూడ, చర్మాస్, అపర్ణ, కాజిగూడ నుంచి వర్షం పడినప్పుడు వరద నీరు తుమారు చెరువులోకి చేరుతుంది. చిన్నపాటి వర్షానికి అలుగు నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో అదనంగా 3 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి అలుగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి



కొంపల్లి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ మధ్య అనుసంధానం చేసే ఈ రోడ్డులో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అలుగు నుంచి నీరు పారడంతో గతంలో చెక్కలతో తాత్కాలికంగా నడవడానికి చిన్నపాటి బ్రిడ్జిని ఏర్పాటు చేశా. వాన రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో వాటిని తొలగించాం. సంబంధిత అధికారులు దృష్టి సారించి అలుగుపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి.

– రవీందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్

ఇరిగేషన్ అధికారులకు లేఖ రాస్తా



కొంపల్లి మున్సిపల్‌కు ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. అలుగుపై బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తా. ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. తక్షణమే ఇరిగేషన్ శాఖ అధికారులకు లేఖ రాస్తాం.

– కృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్


ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చేలా ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం కొంపల్లిలో అల్వాల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్ రూట్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న 45 ఆటోలకు చలాన్ విధించారు. అనంతరం డ్రైవర్లకు కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ఆటోకు నాలుగువైపులా నెంబర్ ప్లేట్లను అమర్చుకోవాలన్నారు. ఆటో ముందు సీటులో డ్రైవర్ తప్ప మరెవరూ కూర్చోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, హెచ్‌సీ నరసింహ, పీసీ విజయ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దేవేందర్

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని సెంట్రల్ పార్క్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని దూలపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ జెమ్మి దేవేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సెంట్రల్ పార్క్ కాలనీలో డ్రైనేజీని పున నిర్మించాలని కోరారు. పార్కు స్థలం కబ్జాకు గురవుతుందని, స్థానికంగా అనేక హాస్టళ్ల కారణంగా మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని తెలిపారు. అను ఫర్నిచర్ దుకాణం వద్ద మూసివేసిన రోడ్డును తిరిగి ఓపెన్ చేయాలన్నారు.

మహీంద్రా యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ లీడర్‌షిప్ డే కాన్ఫరెన్స్

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీలో శుక్రవారం పీఎంఐ పెరల్ సిటీ చాప్టర్ (పీఎంఐపీసీసీ) ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ లీడర్‌షిప్ డే కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈవెంట్‌లో 134 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అకాడమిక్ డీన్ డాక్టర్ బిష్ణు పాల్, మార్కెటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ రాచెర్ల, యునైటెడ్ వే హైదరాబాద్ బోర్డు మెంబర్ డాక్టర్ పెండ్యాల కిరణ్మయి దత్, అమర రాజా గ్రూప్ పీఎంఓ మనోహర్ ఎర్రగుంట్ల హాజరై ప్రసంగించారు. నాయకత్వం అనేది హోదా గురించి కాదని, వ్యక్తులపై ప్రభావం అని అభిప్రాయపడ్డారు. ఇంటరాక్టివ్ ప్యానల్ చర్చలో నిపుణులు నాయకత్వంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) మారుతున్న పాత్రను వివరించారు. మానసికశాస్త్ర విద్యార్థిని శాజియా.. ఏఐ టెక్నాలజీల స్వీకరణలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు గ్లోబల్ సవాళ్లకు వినూత్న పరిష్కారాలను ప్రదర్శించారు. బీవీఆర్ఐటీ ఫర్ ఉమెన్ బీటెక్ విద్యార్థిని అక్షర హిరణ్మయి పర్యావరణ హితమైన నీరు ఆదా చేసే పరికరాన్ని పరిచయం చేశారు. బొప్పన నేహా ద్విచక్ర వాహనాల ప్రమాదాలను అరికట్టేందుకు ఏఐ ఆధారిత సెన్సార్‌ను ప్రతిపాదించారు. మహీంద్రా యూనివర్సిటీ బీబీఏ విద్యార్థి వినయ్ జైన్ ప్లాస్టిక్ వినియోగం, రీసైక్లింగ్‌పై సమర్థవంతమైన మార్గాలను సూచిస్తూ వ్యర్థాలను తగ్గించాలన్నారు. మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులూ మేడూరి మాట్లాడుతూ.. విద్యార్థులు నడిపే అపెక్స్ పీఎంఐపీసీసీ ఎంయూ అనేది మహీంద్రా యూనివర్సిటీ అకాడమిక్ లెర్నింగ్‌లో ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ అనుసంధానానికి ప్రాముఖ్యతను పెంపొందించే కీలకమైన అడుగు అని అన్నారు. పీఎంఐపీసీసీ అధ్యక్షుడు మనోహర్ ఎర్రగుంట్ల మాట్లాడుతూ.. ఐఎస్ఎల్డీ యువతకు నాయకత్వం, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన ప్లాట్‌ఫాం అని అన్నారు.



మహీంద్రా యూనివర్సిటీలో జరిగిన లీడర్‌షిప్ డే లో పాల్గొన్న ప్రముఖులు

అమావాస్య పూజలు.. అన్నదానాలు



అన్నవితరణ చేస్తున్న కట్ట రవికుమార్



జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం పలు ఆలయాలలో పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ సమీపంలోని దుర్గమ్మ ఆలయంలో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో, జీడిమెట్లలోని సరోజినీ గార్డెన్ సమీపంలోని ముత్యాలమ్మ గుడి వద్ద సుచిత్ర వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో, చింతల్ బస్టాప్ సమీపంలో సప్తగిరి వైశ్య ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం పాల్గుణ అమావాస్య సందర్భంగా మగ్దూం నగర్, మైసమ్మ నగర్‌లలోని బొడ్రాయిల వద్ద అభిషేకం నిర్వహించారు.

నిజాంపేట్ : బాచుపల్లి ఆర్య వైశ్య సంఘం ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాల్గునమాస అమావాస్య సందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమానికి తెలంగాణ ఇంటర్ నేషనల్ యూత్ అధ్యక్షులు, తెలంగాణ ఈట్ ఫోరం అధ్యక్షులు కట్ట రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో కొలన్ వీరేందర్‌రెడ్డి, వంగపల్లి నవీన్ కుమార్, అనిల్‌కుమార్, కిరణ్, వినయ్‌కుమార్, శశికల పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు టెండర్



జగద్గిరిగుట్ట: గాజులరామారం సర్కిల్‌లో అభివృద్ధి పనులకు గాను రూ. 2 కోట్లతో టెండర్‌లకు పెట్టారు. సర్కిల్‌కు చెందిన పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర పనుల కోసం కసరత్తు ప్రారంభించారు.

125 గాజులరామారం డివిజన్‌లో..

- అంబేద్కర్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల పక్కన కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ. 24 లక్షలు.
- లెనిన్ నగర్, రాజీవ్ గృహకల్ప గృహాల పక్కన పార్క్ చేయడానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ. 20 లక్షలు.
- ఉషోదయ కాలనీ ఫేజ్ 1 వద్ద వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి కమ్యూనిటీ హాల్ వరకు సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.40 లక్షలు.
- గాజులరామారంలోని శ్రీవేణి ఎన్‌క్లేవ్ వద్ద స్వాతి పైపులైన్ అపార్ట్‌మెంట్ నుంచి లక్ష్మి చిత్ర నిలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షలు కేటాయించారు. 1

126 జగద్గిరిగుట్ట డివిజన్‌లో...

- వార్డు కార్యాలయం పక్కన బహిరంగ స్థలాన్ని రక్షించడానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.18 లక్షలు.
- షిరిడీ కొండల అంతర్గత గల్లీలలో సీసీ రోడ్ల మరమతులకు రూ.20 లక్షలు.
- సంజయ్‌పురి కాలనీ అంతర్గత రోడ్లకు రూ. 30 లక్షలు
- శ్రీనివాస్ నగర్ కాంపౌండ్‌వాల్ నిర్మాణం కోసం రూ.5 లక్షలతో పనులు ప్రారంభం కానున్నాయి.

129 సూరారం డివిజన్‌లో..

- మహిళా భవన్ ఎదురుగా శివాలయ నగర్ వద్ద పార్క్ చేయడానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.20 లక్షలు.
- రాజీవ్ గాంధీ నగర్‌లోని లక్కీ రెస్టారెంట్ నుంచి ముస్లిం శ్మశానవాటిక వరకు ఆర్‌సీసీ స్లాబ్‌కు రూ. 14 లక్షలతో టెండర్లు పెట్టారు.

రోడ్డుపైనే భారీ వాహనాల పార్కింగ్!

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- ప్రతినిత్యం ట్రాఫిక్‌జాం



రోడ్డుపై స్టీల్ లోడుతో ఉన్న భారీ వాహనం

జీడిమెట్ల: వీవీఎస్ స్టీల్ పరిశ్రమకు చెందిన భారీ వాహనాలను నిర్లక్ష్యంగా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల ఫేజ్ 5లోని వీవీఎస్ స్టీల్ పరిశ్రమకు ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిత్యం స్టీల్ లోడ్లతో భారీ వాహనాలు వస్తుంటాయి. పరిశ్రమ లోపల పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో డ్రైవర్లు లారీలను నిర్లక్ష్యంగా పరిశ్రమ ఎదురుగా ఉన్న రోడ్డుపై నిలుపుతున్నారు. 10 మీటర్ల దూరంలోనే నాలుగు రోడ్ల కూడలి ఉండటంతో ఇటు దూలపల్లి అటు జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా ఫేజ్-5కు వచ్చే వాహనాలు అటు ఫేజ్ 3 వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలుస్తున్నాయి. దీంతో అర కిలోమీటర్ మేర ప్రతి రోజు మధ్యాహ్నం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఇంత జరుగుతున్నా సదరు పరిశ్రమ యాజమాన్యం మాత్రం రోడ్డుపై పార్కింగ్‌ను మాత్రం ఆపడం లేదు. దీంతో అత్యవసరం ఉన్న వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఎటూ వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు జీడిమెట్ల ఐలా అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతుతన్నారు.



స్తంభించిన రాకపోకలు

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



గండిమైసమ్మలోని ఎస్పీఆర్ హైస్కూల్‌లో..

- విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ సైన్స్ డే
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

కుత్బుల్లాపూర్: చంద్రశేఖర్ వెంకటరామన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌లను నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆలోచింపజేశాయి. భూకంప అలారం.. రెయిన్ సెన్సార్.. నీటి శుద్ధి తదితర నమూనాలతో అబ్బురపరిచారు. సైన్స్ యొక్క ప్రాధాన్యతను వక్తలు వివరించారు. సైన్స్‌పై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు.



వీఎన్ఆర్ విజేఐఈటీలో నమూనాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీధర్



నిజాంపేట్ జడ్పీహెచ్ఎస్‌లో ..

స్పందించారు.. వీధి లైట్లు అమర్చారు

సాక్షి ఎఫెక్ట్..

'కాలనీలు చీకటిమయం' అనే శీర్షికతో సాక్షిలో 24వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదిత్య గార్డెన్స్ కాలనీ సద్ది బ్లాక్ రోడ్డులో, సాయినగర్ ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లోని పలు రోడ్లు, సాయినగర్ నుంచి నిజాంపేట్ వెళ్లే రోడ్డులో శ్మశానవాటిక పక్కన ఉన్న రోడ్డులో సైతం వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కథనంతో అధికారులు స్పందించి శుక్రవారం వీధి లైట్లు బిగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. –నిజాంపేట్



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ పైపులైన్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీడిమెట్ల ఎస్సీ కాలనీ, జెడ్‌ఆర్ ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్స్, ఆర్‌వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్, శ్వేత ఆర్యన్, అరేమ్స్‌బర్గ్ అపార్ట్‌మెంట్స్, 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటి నుంచి 1.30 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్, 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణనగర్, రుక్మిణి ఎస్టేట్స్, గణేష్‌కాలనీ, జేకే నగర్, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2 గంటల వరకు రామరాజునగర్, మైఫ్రెండ్స్ సర్కిల్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

నేడు అన్నదానం

జగద్గిరిగుట్ట: శ్రీసాయి కాలనీ, చింతల్‌లో ఉన్న అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఓ ప్రకటన విడుదల చేశారు. అంతకుముందు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ సీలింగ్ ఫ్యాన్కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఆరవ ఫేజ్‌లో నివాసం ఉండే సునీల్, పూజ శ్రీలు భార్యాభర్తలు. పూజశ్రీ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. శుక్రవారం బెడ్రూమ్ లో సీలింగ్ ఫ్యాన్కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త సునీల్ వచ్చి తలుపు కొట్టడంతో తలుపు తీయలేదు. దీంతో మరో గది నుంచి తలుపులు తెరిచి చూడగా.. ఫ్యాన్ కు ఉరేసుకొని కనిపించింది. దీంతో వెంటనే పూజ శ్రీ సోదరి సౌమ్యశ్రీకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీలత తెలిపారు.

లౌడ్ స్పీకర్లతో ఇబ్బంది కలిగించొద్దు



పీఎస్ కమిటీ సమావేశంలో మత పెద్దలు, పోలీసులు

సుభాష్‌నగర్: రంజాన్ నెల ప్రారంభమవుతున్న నేపథ్యంలో మసీదుల్లో ప్రార్థన చేసేటప్పుడు లౌడ్ స్పీకర్లతో ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని సీఐ భరత్‌కుమార్ అన్నారు. శుక్రవారం సూరారం పోలీసుల ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం



నిజాంపేట్ : నాలుగు దశాబ్దాలుగా తెలుగు విశ్వ విద్యాలయం లైబ్రేరియన్ బి.వెంకట రమణారెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. వారికి రావలసిన ఆర్థిక లాభాలను వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు అందజేసి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, ఆర్థికాధికారి వెంకటేశ్వర్‌రావు, రింగు రామ్మూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029